క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్‌: కడప నగరంలో ఈనెల 10, 11 తేదీల్లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్‌ లైన్ల మార్పిడి జరుగుతున్నందున మాసాపేట సర్కిల్‌, నిర్మల కాన్వెంట్‌, కొత్త కొట్టాలు, సుబ్బరత్నం కాలనీ, మాచుపల్లి రోడ్‌ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌ శాఖ నార్త్‌ ఏఈ షకీల్‌ అహ్మద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సిఫారసు బదిలీలను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్‌: కౌన్సెలింగ్‌ విధానికి విఘాతం కలిగిస్తూ ప్రజాప్రతినిధుల సిఫారసు మేరకు చేపట్టిన టీచర్ల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం కడప జిల్లా పరిషత్తు కార్యాలయ ఆవరణలో జరిగిన ఏపీటీఎఫ్‌ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లో పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలను చేపడతామని ఓవైపు విద్యాశాఖ మంత్రి చెబుతూనే మరోవైపు సిఫారసు బదిలీలను చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న సీనియర్‌ ఉపాధ్యాయులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. వెంటనే సిఫారసు బదిలీలు రద్దు చేసి బదిలీలు, ప్రమోషన్లకు మార్గదర్శకాల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, గురయ్య, సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాహుకాల పూజలు

కడప కల్చరల్‌: కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణ సరికాదు

కడప ఎడ్యుకేషన్‌: వేసవి సెలవుల్లో పదవ తరగతి ఫెయిల్‌ అయిన విద్యార్థుల కోసం నిర్వహించే రెమిడియల్‌ క్లాసులను ఉపసంహరించుకోవాలని లేదంటే .. ఎడ్యుకేషన్‌ డిపార్టుమెంట్‌ను నాన్‌ వేకేషన్‌ డిపార్టుమెంట్‌గా ప్రకటించాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో రెమిడియల్‌ క్లాసులను నిర్వహించడం సమంజసం కాదన్నారు.

రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: రాష్ట్రంలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్‌ జిల్లా కార్యదర్శి గంగా సురేష్‌ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని లక్ష్య అకాడమీలోని ఉద్యోగ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ముప్పై వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. నాలుగేళ్లుగా కోచింగ్‌ సెంటర్లలో కోచింగ్‌ తీసుకుంటూ ఉద్యోగ నోటిఫికేషన్‌ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్ల పెంపు ఆలోచనను విరమించుకోవడంతో పాటు వయోపరిమితిని 45 ఏళ్లకు పెంచాలని డిమాండ్‌ చేశారు. మైనుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఏ జిల్లా కమిటీ రద్దు

ప్రొద్దుటూరు : రాయలసీమ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ (ఆర్‌ఎస్‌ఏ) జిల్లా కమిటీని రద్దు చేసినట్లు అసోసియేషన్‌ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బి.ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు, మీడియా సంస్థలు, గమనించాలని ఆయన కోరారు. నూతన కమిటీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

సీపీఐ నేత శంకరయ్య మృతి తీరని లోటు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: సీపీఐ సీనియర్‌ నేత శంకరయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు, ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ నేత శంకరయ్య మృతికి సంతాపం తెలియజేశారు. ఉమ్మడి కడప జిల్లా రైల్వే కోడూరు నియోజక వర్గం మంగంపేట చెందిన మాజీ సర్పంచ్‌గా పని చేసి సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి, ఉమ్మడి కడప జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులుగా పని చేశారన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : లేటపల్లె సచివాలయ పరిధిలోని పొడదుర్తి, వెంకటాపురం, ఎర్రబల్లె, కొత్తపల్లె గ్రామాలలో బుధవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ చలపతిఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలి

కడప సెవెన్‌రోడ్స్‌ : క్రీడల్లో మరింత రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని కలెక్టర్‌ విజయరామరాజు అన్నారు. తిరుపతి నగరంలో ఈనెల 1వ తేది నుంచి 5వ తేది వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎం కప్‌ టోర్నమెంటు విజేతలు మంగళవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ వారిని అభినందించారు. ఫుట్‌బాల్‌ మహిళా విభాగంలో మొదటి స్థానం, హ్యాండ్‌బాల్‌ పురుషుల విభాగంలో రెండవస్థానం జిల్లాకు దక్కాయి. బ్యాడ్మింటన్‌లో మహిళలు మూడవ స్థానం, పురుషులు రెండవ స్థానం దక్కించుకున్నారు. హాకీలో పురుషులు మూడవస్థానంలో నిలిచారు. టెన్నిస్‌లో మహిళలు రెండవస్థానం, పురుషులు మూడవస్థానంలో నిలిచారు. వెయిట్‌ లిఫ్టింగ్‌లో మహిళలు మొదటి స్థానంలో నిలువగా, పురుషులు 2, 3 స్థానాల్లో నిలిచారు. బాక్సింగ్‌లో పురుషుల విభాగంలో మూడవస్థానం లభించిందని స్టెప్‌ సీఈఓ సాయిగ్రేస్‌ కలెక్టర్‌కు వివరించారు.



టెన్నిస్‌లో 2వ స్థానంలో నిలిచిన మహిళా జట్టును అభినందిస్తున్న కలెక్టర్‌ విజయరామరాజు

కడప స్పోర్ట్స్‌: ఇటీవల తిరుపతి నగరంలో నిర్వహించిన ఏపీ సీఎం కప్‌ హాకీ చాంపియన్‌షిప్‌లో వైఎస్‌ఆర్‌ కడప జిల్లా జట్టు మూడోస్థానంలో నిలవడంలో కీలకంగా వ్యవహరించిన సీనియర్‌ హాకీ క్రీడాకారులను ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ అభినందించారు. ఎ.ఎన్‌.కిశోర్‌కుమార్‌ (మైదుకూరు పీఎస్‌), సందీప్‌ రాజు (చిన్నచౌకు పీఎస్‌), ఎ.ఎన్‌. కీర్తి (ట్రాఫిక్‌, కడప), శౌరికుమార్‌, కల్యాణ్‌కుమార్‌ (హాకీ శిక్షకులు)లను ఎస్పీ అభినందించారు. స్టెప్‌ సీఈఓ సాయిగ్రేస్‌ , జాయింట్‌ కలెక్టర్‌ జి. గణేష్‌కుమార్‌, ట్రైనీ కలెక్టర్‌ రాహుల్‌మీనా, డీఎస్‌ఏ చీఫ్‌ కోచ్‌ ఎన్‌.వి.పి. అమృత్‌రాజ్‌, కోచ్‌లు పాల్గొన్నారు.



హాకీ క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ

బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ కరువు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ ఎంపీ మహిళా క్రీడాకారుల పట్ల అసభ్యంగా వ్యవహరించిన తీరును నిరసిస్తూ నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని రెజ్లింగ్‌ మహిళా క్రీడాకారులపై పోలీసులు లాఠీచార్జ్‌ చేయడం దుర్మార్గమన్నారు. ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, సుబ్బరాయుడు, భాగ్యలక్ష్మీ, మైనుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.



ఏడురోడ్ల కూడలిలో కాగడాల ప్రదర్శన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మాజీ ఎమ్మెల్సీ షేక్‌ హుస్సేన్‌కు పరామర్శ

కడప కార్పొరేషన్‌: కడప నగరంలోని శ్రీకర హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ షేక్‌ హుస్సేన్‌ను సిటీ మేయర్‌ కె. సురేష్‌ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య వివరాలను డాక్టర్‌ రామాంజులరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్‌ రామలక్ష్మణ్‌రెడ్డి, డివిజన్‌ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్‌ పాల్గొన్నారు.

పోలీసుల పిల్లలకు యోగా, ధ్యానం

కడప కల్చరల్‌ : కడప నగరానికి చెందిన పిరమిడ్‌ స్పిర్చ్యువల్‌ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ ఊర్మిళాదేవి, సలహదారు జీవీఎస్‌ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు పిరమిడ్‌ ధ్యాన కేంద్రంలో చిన్నారులకు యోగా, ధ్యానం నేర్పుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్‌ ఊర్మిళాదేవి, జీవీఎస్‌ రెడ్డి మాట్లాడుతూ బాలలకు యోగా, ధ్యానంతోపాటు శారీరక ఆరోగ్యం కోసం ఆటలు కూడా నేర్పుతున్నామని తెలిపారు. ధ్యానం అంటే శ్వాసపై ధ్యాస అని వివరించారు. వేసవి సెలవుల్లో 5–15 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలలకు ప్రతిరోజు ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు యోగా,ధ్యానం తోపాటు నీతి కథలను కూడా బోధిస్తామని తెలిపారు. కన్వీనర్‌ మురళి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిక్షణకు పంపి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘జగనన్నకు చెబుదాం’ను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : ‘జగనన్నకు చెబుదాం’ను సద్వినియోగం చేసుకోండని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం దేవరాజుపల్లె సచివాలయ పరిధిలోని చిన్నపుత్త, జీవంపేట, సముద్రంపల్లె గ్రామాల్లో ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే వారి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్‌ కార్డు, ఉపాధి పనులు, వీధి దీపాలు తదితరవి కావాలని ప్రజలు కోరడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు.

జగనన్న చెబుదాం... 1902 దయల్‌ చేయండి...

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం... అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని, 1902కు డయల్‌ చేసి తమ సమస్యలు సీఎంకు వివరించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారమే సీఎం జగనన్న ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారని, ప్రజలు తమ అపరిష్కృత సమస్యలు ఉంటే పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఇప్పటి వరకు ప్రయత్నించి పరిష్కారం కాని ప్రజా ఫిర్యాదుల కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాల్లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇతర పార్టీ నాయకులు ఇంతవరకు పర్యటించలేదని ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రమే ఈ గ్రామాల్లో పర్యటిస్తున్నారన్నారు. 2021 ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్‌ రామాంజులరెడ్డి ఈ గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేశారన్నారు. అయితే ఈ గ్రామాల్లో టీడీపీ నాయకులు అర్ధరాత్రి ఇంటియజమానులకు తెలియకుండా జెండాలు కట్టారు తప్ప ప్రజలతో కలసి వారిసమస్యలను తెలుసుకోలేదన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వృద్ధాశ్రమంలో అన్నదానం

వైవీయూ : కడప నగర పరిధిలోని బృందా వృద్ధాశ్రమంలో ఖాజీపేటకు చెందిన కె. హుస్సేన్‌, సంజమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాణిక్‌బాషా, బీబి, ఉష, ఇమాంఖాసీం వృద్ధులకు స్వయంగా వడ్డించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. వృద్ధాశ్రమం నిర్వాహకుడు సుబ్బయ్య పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా నిర్వహించాలి

వల్లూరు : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ జుబేద తెలిపారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సభా భవనంలో మంగళవారం సచివాలయ మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు. ప్రతిరోజు స్పందనను నిర్వహించాలని, తప్పని సరిగా బయోమెట్రిక్‌ హాజరును వేయాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వచ్చే వినతులను, సమస్యలను పరిష్కరించడానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా వుండాలన్నారు. తహసీల్దార్‌ అమరేశ్వరి పక్కా గృహాల ఓటీఎస్‌ కార్యక్రమం గురించి చర్చించారు. ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌ పాల్గొన్నారు.

సాధనతో లక్ష్యాన్ని జయించవచ్చు

కడప కల్చరల్‌ : సాధనతో ఎంత ఉన్నత లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని లైబ్రేరియన్‌ జేమ్స్‌ అన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయం రూపొందించిన ×చదవడం మాకిష్టం× కార్యక్రమాన్ని ప్రత్యేక శిక్షణ శిబిరంలో నిర్వహిస్తున్నారు. మంగళవారం కడప నగరం కొండాయపల్లెలోని కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో జరిగిన శిక్షణలో భాగంగా ఆయన లక్ష్య సాధనకోసం చూపాల్సిన శ్రద్ధ గురించి వివరించారు. తొలుత చదివే గుణాన్ని కథలు వినడం, చెప్పడం ద్వారా నేర్చుకోవచ్చని సూచించారు. చిట్టిచిట్టి కథలు చెప్పి వాటిని పిల్లలతో చెప్పించారు. శిక్షకులు నవాజ్‌జాన్‌, ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి , క్రాఫ్ట్‌ శిక్షకులు రంగనాయకులు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.



కాగితపు పూల తయారీ మెళకువలు నేర్పుతున్న రంగనాయకులు

ఏజెంట్ల మాయలో పడొద్దు

● మోసపోయి గల్ఫ్‌ దేశాల్లో ఇబ్బంది పడుతున్న వారు మదద్‌ వెబ్‌ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి

● ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌

కడప అర్బన్‌: జీవనోపాధి, ఉద్యోగం, వ్యాపారం, ఇతర ప్రయోజనాల దృష్ట్యా గల్ఫ్‌ లేదా ఇతర దేశాలకు వెళ్లదలచుకున్న జిల్లా వాసులు అక్రమ ఏజెంట్లు చెప్పిన మాటలు విని మోసపోవద్దని, ప్రభుత్వం ద్వారా నమోదు/ రిజిస్టర్డ్‌ కాబడిన రిక్రూటింగ్‌ ఏజెంట్ల ద్వారా మాత్రమే వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలనీ ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ సూచించారు. ఈమేరకు మంగళవారం ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఏటా కొన్నివేల మంది అమాయకులు కువైట్‌,సౌదీ, ఖతర్‌, ఇతర దేశాలకు గృహకార్మికులుగా/ ఇంటి పనిమనిషిగా పనిచేయుటకు అక్రమ పద్ధతుల ద్వారా పంపబడుతున్నారని, ఈ విషయంలో అక్రమ ఏజెంట్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. వెళ్లిన వారు విదేశాల్లో సరైన వసతి, భోజనం, జీతం వంటి సౌకర్యాలు అందక, విదేశాల్లో ఉపాధి కల్పించిన వారి నుంచి శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నారన్నారు. జీవనోపాధి, ఉద్యోగం, వ్యాపారంలు మొదలగు ప్రయోజనాల దృష్ట్యా గల్ఫ్‌ లేదా విదేశాలకు వెళ్లదలచుకున్న వారు పీఓఈ (ప్రొటెక్టర్‌ ఆఫ్‌ ఎమిగ్రేట్స్‌) ద్వారా నమోదు, రిజిస్టర్డ్‌ కాబడిన రిక్రూటింగ్‌ ఏజెంట్ల ద్వారా మాత్రమే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పేకొన్నరు. ఇప్పటికే గల్ఫ్‌ లేదా విదేశాల్లో ఉంటూ ఇబ్బందులు గురవుతున్న వారి గురించి, లేదా మీ సంబంధీకుల గురించి గానీ మదద్‌ వెబ్‌ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. అక్రమ ఏజెంట్లకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే స్పెషల్‌ బ్రాంచ్‌ ఇన్‌స్పెక్టర్‌ (91211 00650, 85008 68922)కు తెలియజేయాలనీ ఎస్పీ అన్బురాజన్‌ సూచించారు.

తపాలాశాఖ యూనియన్ల రద్దు దారుణం



తపాలా శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ యూనియన్లను రద్దు చేయడం దారుణమని అఖిల భారత ఉద్యోగుల సంఘం గ్రూప్‌–సి డివిజనల్‌ కార్యదర్శి జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప డివిజన్‌ తపాలాశాఖ కార్యాలయం ఎదుట తపాలాశాఖ యూనియన్ల రద్దును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా యూనియన్లను గుర్తింపును రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే రద్దు చేసిన యూనియన్లను వెంటనే పునరుద్ధరణ చేయాలన్నారు. యూనియన్‌ డివిజన్‌ సెక్రటరీలు సలామ్‌, పాలకొండ్రాయుడు, గోవిందు, రమాకాంత్‌ పాల్గొన్నారు.

పోస్టల్‌ శాఖ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: పోస్టల్‌ శాఖ ఎంచుకున్న లక్ష్యాల సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని కడప డివిజన్‌ ఇన్‌చార్జ్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ సీహెచ్‌ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని తపాలాశాఖ ప్రధాన కార్యాలయంలో గత ఆర్థిక సంవత్సరంలో పోస్టల్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ లక్ష్యాలను బాగా చేసినందుకు ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు పోస్టల్‌ శాఖ అభివృద్ధి కృషి చేసేందుకు పాటుపడాలన్నారు. కడప డివిజన్‌ అసిస్టెంట్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌లు విజయ్‌ భాస్కర్‌, రమశంకర్‌, ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు, పిఎల్‌ఐ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ మునాఫ్‌ పాల్గొన్నారు.

దేవాలయాలలో సామూహిక ప్రార్థనలు

కడప కల్చరల్‌ : భజరంగ్‌దళ్‌ను నిషేధించాలని కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన పిలుపును నిషేధిస్తూ విశ్వహిందూ పరిషత్‌ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి, భజరంగ్‌దళ్‌ రాష్ట్రీయ సంయోజక్‌ల పిలుపు మేరకు మంగళవారం దేవాలయాల్లో సామూహికంగా హనుమాన్‌ చాలీసా పఠనం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 200 దేవాలయాలలో దాదాపు 1500 మంది కార్యకర్తలు, మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పాత బస్టాండులోని వీహెచ్‌పీ కార్యాలయంలో సాయంత్రం 7 గంటలకు మహిళా భక్తులు రాష్ట్ర ధర్మాచార్య సంపర్క్‌ ప్రముఖ్‌ రామమహేష్‌, గంగిరెడ్డి, సురేంద్ర తదితరుల ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్‌ చాలీసా పారాయణం చేశారు.

‘జీ.వి ఫుట్‌బాల్‌’పై ఫిర్యాదు చేయవచ్చు

● కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌

కడప అర్బన్‌: జిల్లాలో జీ.వి. ఫుట్‌బాల్‌ అనే ఆన్‌లైన్‌ గేమింగ్‌ యాప్‌లో సభ్యులుగా చేరాలనీ, ఈవెంట్లు నిర్వహిస్తూ, ప్రజలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌ అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడారు. జీ.వి ఫుట్‌బాల్‌ యాప్‌పై సుమోటోగా పోలీసుల ఆధ్వర్యంలోనే కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 12 మంది ఈవెంట్‌ ఆర్గనైజర్లపై చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా ఏదైనా సమాచారం వుంటే తమ దృష్టికి తీసుకురావాలనీ అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసుపై జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) తుషార్‌ డూడీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ద్వారా విచారణ కొనసాగిస్తున్నామన్నారు. ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.



వాణిజ్యశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్తు

వైవీయూ ప్రిన్సిపాల్‌ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: వాణిజ్యశాస్త్ర అధ్యయనంతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని వైవీయూ ప్రిన్సిపాల్‌ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ వాణిజ్యశాస్త్ర విభాగం ఆచార్యులు డా.విజయభారతి ఆధ్వర్యంలో ‘కామ్‌ తరంగ్‌–2కె23’ పేరుతో విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లోని సెమినార్‌ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందుకు సాగాలంటే ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ ఆచార్య టి. శ్రీనివాస్‌ మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని పరస్పరం పెంపొందించుకునేందుకు ఇలాంటి వేదికలు దోహదం చేస్తాయన్నారు. ఆచార్య రఘునాథరెడ్డి , సీడీసీ డీన్‌ ఆచార్య వై. సుబ్బరాయుడు, కార్యక్రమ నిర్వాహకులు ఆచార్య విజయభారతి మాట్లాడుతూ వాణిజ్యశాస్త్ర విద్యార్థులకు అపార ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఇన్నోవేషన్‌, ఎక్స్‌పో లోగో డిజైన్‌, బృంద చర్చ, రీసైకిల్‌ మానియా, పోస్టర్‌ మేకింగ్‌, క్విజ్‌, వన్‌మినిట్‌ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. హరినాథ్‌, డా. రజనీ, డా. రఫీ, హరినాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు

దళితులు, మైనార్టీలపై దాడులను అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: దేశంలో, రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపై దాడులను అరికట్టాలని కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్‌ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో దళితులు–మైనార్టీలపై దాడులు అనే అంశంపై అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చర్చా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్‌ బి.ఆర్‌ అంబేడ్కర్‌ రచించిన రాజ్యాంగాన్ని ప్రస్తుత పాలకులు మార్చి మనోధర్మ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. ఈ కుట్రలతోనే దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. దేశంలో ముస్లింలకు రిజర్వేషన్లు తొలగిస్తామని అమిత్‌ షా ప్రకటించి ముందుగా కర్ణాటకలో తొలగించారన్నారు. ముస్లింలకు తొలగించిన రిజర్వేషన్లను దళితులకు ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు బండి జకరయ్య, నజీర్‌ అహ్మద్‌, రామ్మోహన్‌, విష్ణుప్రీతం రెడ్డి, ఖాదర్‌ఖాన్‌, గుర్రప్ప, సల్లావుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కడప ఎడ్యుకేషన్‌: పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో బాలికలు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌ రెడ్డి అన్నారు. మంగళవారం కడప ట్రంక్‌ రోడ్డులోని మౌలానా ఎడ్యుకేషన్‌ వెల్ఫేర్‌ సొసైటీ కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు షేక్‌ షబ్బీర్‌ ఆధ్వర్యంలో ఇంటర్‌ బైపీసీ ఫస్ట్‌ ఇయర్‌లో 440కి 436 మార్కులు సాధించిన రాష్ట్రంలో 2వ ర్యాంకు సాధించిన సఫియాఖానంను, అలాగే పదవ తగరతిలో 600 మార్కులకు 592 మార్కులు సాధించి రాష్ట్రంలో 4వ ర్యాంకు సాధించిన సయ్యద్‌ అఫీఫా అంజుమ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌ కడప జిల్లా నుంచి విద్యార్థులు ఉన్నత మార్కులను సాధించడం ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్‌ మాజీ ప్రెసిడెంట్‌ సంఘంసేవకులు మొహమ్మద్‌ తాజుద్దీన్‌, విద్యార్థుల తల్లిదండ్రులు అబ్బాస్‌ అలీఖాన్‌, సయ్యద్‌ ఖాజీపీర్‌ పాల్గొన్నారు.

ప్లస్‌ టూ పాఠశాలల్లో జేఎల్‌ పోస్టులు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్‌: ప్లస్‌ టూ పాఠశాలల్లో పీజీటీ పోస్టులు కాకుండా జేఎల్‌ పోస్టులను మంజూరు చేసి వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌ విద్య బోధించడానికి ఒక ఇంక్రిమెంట్‌ ద్వారా పీజీటీ పోస్టులను భర్తీ చేసే విధానాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. పీజీటీ జేఎల్‌ పదోన్నతికి సమానంకాదని, ఇలా చేయడం పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం కలిగించడమే అని అన్నారు.

15న హుండీ ఆదాయం లెక్కింపు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ దేవస్థాన హుండీని ఈనెల 15న లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ పి.సురేష్‌ కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.